క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

అరకులోయ టౌన్: వైఎస్సార్‌సీపీ మండల సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు స్వాభిరామమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలకు అంతరాయం

హుకుంపేట: బీఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్స్ లేక నాలుగు రోజులపాటు హుకుంపేట వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మధ్యకాలంలో ఆధార్, బ్యాంక్ లింకేజి, తదితర ఓటీపీ పనులు నెట్‌వర్క్ లేకపోవడం వల్ల ఆగిపోతున్నాయి. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకుని పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా మాజీ జిల్లా అధ్యక్షుడు తెడబారికి సురేష్‌కుమార్ కోరారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పరామర్శ



సత్యవతి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: మండలంలో వాంగెడ్డ గ్రామంలో శెట్టి సత్యవతి పార్థివ దేహానికి పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. చౌడుపల్లి పంచాయతీ వాంగెడ్డ గ్రామానికి చెందిన శెట్టి చిన్నయ్య పడాల్ ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నా రు. ఆయన కుమార్తె సత్యవతి అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్యపడాల్, మాజీ ఎంపీపీ సాగిన దేవుడమ్మ, మాజీ జెడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు సాగిన రామారావు, నాయకులు సాగిన గంగన్నపడాల్, కోరాబు కరుణానిధి, గంతన్నపడాల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

39,940 పాఠ్య పుస్తకాలు రాక



పాఠ్య పుస్తకాలు సర్దుతున్న సీఆర్‌పీలు

కొయ్యూరు: ఆయా పాఠశాలలకు పాఠ్య పుస్తకాలను తరలిస్తున్నామని ఎంఈవో ఎల్. రాంబాబు తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని శనివారం విలేకరులకు తెలిపారు. ఇప్పటి వరకు 39,940 పుస్తకాలు వచ్చాయన్నారు. అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులకు వాటిని తీసుకెళ్లాలన్నారు. బెల్టులు, ఇతర సామగ్రి వచ్చిందన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి అన్ని సిద్ధంగా ఉంటాయని తెలిపారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయాలి



అనిల్ ప్రసాద్

రంపచోడవరం: ఏజెన్సీలో వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని రంపచోడవరం డివిజన్ వైఎస్సార్ సీపీ ఆర్టీఐ కన్వీనర్ గొర్లె అనిల్‌ప్రసాద్ (బాబి) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో భర్తలను కోల్పోయిన మహిళలు 2022లో మరణ ధ్రువ పత్రాలు వంటివి సకాలంలో చేసుకోలేక వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోలేదన్నారు. ప్రస్తుతం వారు వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాలకు వెళ్తే, 2023లో భర్తలను కోల్పోయిన వారికి మాత్రమే అవకాశం ఉందని సిబ్బంది, మండల అధికారులు చెబుతున్నారని వాపోయారు. వెబ్‌సైట్‌లో కేవలం వీరికి మాత్రమే పింఛన్ల కోసం అవకాశం కల్పించి, 2022లో భర్తలను కోల్పోయిన వారికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ విషయంలో కలెక్టర్, డీఆర్‌డీఏ పీడీ తక్షణమే స్పందించాలని కోరారు.

నాగదేవత అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



నాగదేవత అమ్మవారి విగ్రహాలు

అనకాపల్లి టౌన్ : తుమ్మపాల గ్రామం అంబేడ్కర్ కాలనీలో వెలసిన నాగదేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నాగదేవత అమ్మవారి విగ్రహ ఊరేగింపు గ్రామంలో నిర్వహించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది.

సమస్యల చెంత.. వారపు సంత



సంతలో పేరుకుపోయిన చెత్త • దుర్గంధంతో సతమతం • పట్టించుకోని పంచాయతీ అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు **వారపు సంత** డుంబ్రిగుడ, అరకులోయ మండలా**లతో పాటు** ఒడిశా ప్రాంతం వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి వారం లక్షల్లో వ్యాపారం జరుగుతున్న ఈ సంతలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఓ వైపు చెత్త ..మరోవైపు చిత్తడి దారుల సమస్య వేధిస్తోంది. వారపు సంత కంపుకొడుతోంది. ముఖ్యంగా గిరిజనుల అటవీ ఉత్పత్తులు, సరకులు భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన గిడ్డంగులు, సంత షెడ్ల వద్ద కుప్పలు కుప్పలుగా చెత్తాచెదారం దర్శనం ఇస్తుంది. దీంతో వారపు సంతకు వచ్చేవారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో చేపల మార్కెట్ మాత్రమే ఉండేది. అయితే ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. మందుబాబులు వినియోగిస్తున్న బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులతో కూడిన చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. ఈ ప్రాంతం అధ్వానంగా మారిందని సంతకు వచ్చే



సంతలో చేపల మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్త



సంత అనంతరం దుకాణాల వద్ద చెత్త కుప్పలు

గిరిజనులు వాపోతున్నారు. గతంలో పంచాయతీ అధికారులు చెత్తను తొలగించేందుకు ప్రతి వారం సిబ్బందితో పనులు చేసేవారు. ప్రస్తుతం ఇక్కడ చెత్తను తొలగించే చర్యలు తీసుకోకపోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయని చెబుతున్నారు. సంతలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయిన చెత్త కుప్పల వల్ల దుర్గంధంతో పాటు దోమలు పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశముందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సంతలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చిత్తడి దారితో అవస్థలు

వారపు సంత పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు వర్షాలు పడితే వరద నీరు చేరి సంత ప్రాంతం బురదగా మారుతుంది. మోకాల్లోతు బురదలో సంతకు వచ్చే గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో కనీసం సీసీ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని గత సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ జి.శారద అధికారులను కోరిన విషయం తెలిసిందే. సంత ప్రాంతలో ఒక్కటే చేతి బోరు ఉండడంతో ఇక్కడ వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి



వారపు సంతలో చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేస్తుండడంతో సంతకు వచ్చే వారికి కాస్త ఇబ్బందిగా ఉంది. దుర్వాసనతో ముక్కు మూసుకోవాల్సి వస్తుంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. అధికారులు స్పందించి వారపుసంతలో చెత్తాచెదారం తొలగించాలి.

– బి.రవికుమార్, గత్తరజీలడ గ్రామం, కొర్రాయి పంచాయతీ

పాలిథిన్ విక్రయాలకు అడ్డుకట్ట



వారపు సంతలో పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయానికి అడ్డుకట్ట వేయాలి. ప్రస్తుతం సంతలో పాలిథిన్ వినియోగం బాగా పెరిగింది. వాతావరణానికి విఘాతం కలిగించే పాలిథిన్, ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గోల్లోరి అర్జున్, నందివలస గ్రామం పోతంగి పంచాయతీ

చర్యలు తీసుకుంటాం

ప్లాస్టిక్ నివారణతో పాటు చెత్తా చెదారం తొలగించేందుకు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. వారంలోగా సంతలో చెత్తా చెదారం తొలగించి, సంత ప్రాంతం అంతా శుభ్రపరిచేందుకు చర్యలు తీసుకుంటాం.

– ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

నిరుపేద కుటుంబానికి ఆర్థిక చేయూత

ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, స్థానిక నాయకులు

పెదబయలు: మండలంలో సీతగుంట పంచాయతీ రోగుల గ్రామానికి చెందిన వెచ్చంగి విజయరాజు, కాసులమ్మ కుటుంబానికి ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హ్యాండ్స్ బాసటగా నిలిచింది. వీరికి ముగ్గురు ఆడపిల్లలు కావడంతోపాటు తల్లి కాసులమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక స్థోమత లేక పూట గడవడం కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న గిరిజన సంఘం జిల్లా నాయకుడు బొండా సన్నిబాబు చొరవతో 'ఆదివాసీ ఆర్మీ హెల్పింగ్ హ్యాండ్' ఆధ్వర్యంలో శనివారం రూ.10 విలువైన నిత్యావసరాలు, రూ. 5 వేలు అందజేశారు. పిల్లలకు దోమతెర బుట్టలు పంపిణీ చేశారు. డి. డాలిరాజు, ఎం.చిన్నారావు, తాంగుల మన్మథరావు, సీతగుంట సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ బొంజుబాబు రెండు నెలలకు సరిపడే బియ్యం ఇతర నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొండా గంగాధర్, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, వినోద్, గూబరి రాధాకృష్ణ, జగత్‌రాయ్, కళావతి, కాసులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక



యాట్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



ముమ్మిడివరపు వెంకట దుర్గాభవాని

అడ్డతీగల: ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ఆదర్శంగా నిలిచిన మండలానికి చెందిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులను దక్కించుకున్నారు. యాట్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ముమ్మిడివరపు వెంకట దుర్గాభవాని, జొన్నాడ జశ్వంత్ సాయి విఘ్నేష్, చింతాల విశాల్, చేపల కృష్ణవేణి, వల్లీ చేతన్‌రాజు, మడితాడి మహేష్ ఈ అవార్డుకు ఎంపికయ్యారని ఎంఈవో పి.శ్రీనివాసరావు తెలిపారు. వీరికి రూ.20 వేలు ప్రోత్సాహం, బంగారు పతకం, ప్రశంసాపత్రం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

రేషన్‌కు బదులు నగదు బదిలీ ప్రక్రియను విరమించుకోవాలి

- సుదూర గిరిజన గ్రామాలకు ఎండీయూ వాహనాలతో రేషన్ అందించాలి
- 90 శాతం మేర గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు జమ కాని నగదు
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ డిపోలకు సుదూరంగా గిరిజన గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహనాలతో రేషన్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్ట ప్రకారం 14 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే రేషన్ అవసరం లేకపోతే డబ్బులు తీసుకోవచ్చునని రేషన్ లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్ల పథకంలో 90 శాతం మేర లబ్ధిదారులకు నగదు ఖాతాలో జమకాలేదన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా మూడు రకాల కార్డులను విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు 17 రకాల నిత్యవసర సరుకులు అందించాలని కోరారు. రేషన్ మాఫియాకు ప్రధానంగా అధికార పార్టీ నాయకులే కారకులను ఆరోపించారు. మండలానికో ఏజెంట్‌ను నియమించుకొని రేషన్ బియ్యాన్ని సేకరించి రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా దేశంలో 1955లో పీడీఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసమానతలను నిర్మూలించేందుకు రేషన్ పంపిణీని కొనసాగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

ఎరువుల వినియోగాన్ని తగ్గించండి



బి.కె.పల్లిలో రైతులకు సాగు పద్ధతులను వివరిస్తున్న శాస్త్రవేత్త ప్రసాదరావు

కోటవురట్ల: పంటల సాగులో ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని బి.కె.పల్లి, యండపల్లి, అన్నవరం గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల్లో ముందుగా పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసందలను సాగు చేసి దుక్కులో కలియదున్నాలన్నారు. దీంతో పాటు పశువుల గెత్తాన్ని కూడా దుక్కులో వేయడం వల్ల భూమి సారవంతమవుతుందని చెప్పారు. యంత్రాల వినియోగంతో కూలీల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఈ నెల 12 వరకు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంత్ గౌడ్, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు త్రినాథా, గంగ, రైతులు పాల్గొన్నారు.

మునగపాక: యూరియా వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్త శ్రీహరిరావు సూచించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా శనివారం అనకాపల్లి వ్యవసాయ శాఖ, బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పల్లపు ఆనందపురం, కుమారపురం గ్రామాల్లో పంటల సాగుపై అవగాహన కల్పించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



జోలాపుట్టులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాజవొమ్మంగి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చింతూరు మసీదులో ఆలింగనంతో శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



శుభాకాంక్షలు చెబుతున్న ముస్లింలు



చింతపల్లి మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చింతూరు: బక్రీద్ పండుగను స్థానిక ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మస్జీదే యాసీన్‌లో రెండు రకాతుల ఈదుల్ అథా నమాజును ఆచరించారు. అనంతరం ఇమామ్ ఎజాజ్ అహ్మద్ ఖురాన్ పఠనంతో పాటు పండగ ప్రాముఖ్యతను వివరించారు. దువా అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ కిఫాయత్, సభ్యులు మొహమ్మద్ జిక్రియా, దస్తగిరి, అయ్యూబ్, జహంగీర్, సుభానీ, యాసీన్, షహెన్‌షా, జేకేసీటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో జోలాపుట్టులో శనివారం బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదులో మతపెద్దలు జాకీర్ హుస్సేన్, ఎండీ సోలెమాన్, ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొత్త బట్టలు ధరించి పండగ ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. అనంతరం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

రాజవొమ్మంగి: త్యాగానికి ప్రతీకగా చెప్పుకొనే బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం స్థానిక రెహమానియా మసీదులో ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగాన్ని, సందేశాన్ని మసీదు గురువు హుస్సేన్ వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేదలకు ఆహారం, నగదు బహుమతులుగా ఇచ్చారు.

అరకులోయ టౌన్: స్థానిక మసీదులో అరకులోయ, డుంబ్రిగుడ ముస్లింలు నమాజ్ చేశారు. అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. మతపెద్దలు గులాం హైదర్ ఆలీఖాన్, హర్షత్ ఖాన్, ఎస్‌కే యాసీన్, ఎస్‌కే రెహమాన్, మండల కో ఆప్షన్ సభ్యుడు రహీం తుల్లా, షేక్ ఖాదర్, ఎస్‌కే బాషా, ఖాన్, సయ్యద్ మోహిద్దిన్, ఎస్‌కే షబ్బీర్, బషీర్, అజ్హారుద్దీన్, సయ్యద్ యాషిన్, మదీనా, షరీఫ్, రహీం పాల్గొన్నారు.

చింతపల్లి: బక్రీద్ సందర్భంగా స్థానిక మసీదులో చింతపల్లి, జీకే వీధి మండలాల ముస్లింలు ప్రార్థనలు చేశారు. మత గురువు (ఇమాన్) షహీద్ వేడుక ప్రాధాన్యతను వివరించారు. పలువురు ముస్లింలు ఖుర్బానీ ఇచ్చి భక్తిని చాటుకున్నారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు షేక్ మీరాసాహెబ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15 వాహనాలకు జరిమానా

కశింకోట : కశింకోటలో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న సుమారు 15 వాహనాలకు జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, ఆటో ల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, కారులో సీటు బెల్టులను ధరించాలని వాహన చోదకులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

నర్సీపట్నం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, యువకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విద్యార్థులు రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమానారాయణ హాస్పటల్ డాక్టర్ మల్లికార్జున్, వి.వి.ఎస్ నర్సింగ్ హోమ్ డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 9 సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని హ్యాండ్స్ వ్యవస్థాపకులు టి.మల్లేష్ పేర్కొన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన జి.శ్రీనివాస్ తదితరులను సన్మానించారు.

10 లీటర్ల సారా స్వాధీనం



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న నాటు సారా

పాయకరావుపేట: గుంటపల్లిలో దాడులు నిర్వహించి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ (అనకాపల్లి) సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి, గుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిని సారాతో పట్టుకున్నట్లు తెలిపారు. సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడిని యలమంచిలి కోర్టుకు తరలించగా 14 రోజులపాటు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అనకాపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు టి.వెంకట అప్పలనాయుడు, పి.వి.గిరి, హెచ్.సి.ఎం.ఎస్.రాజు, వి.సంతోష్ పాల్గొన్నట్లు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ముగ్గురు ఎంపిక



జోష్న



వివేక్ నాగసాయి



జెస్సికా

కొయ్యూరు: జాతీయ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ప్రభుతోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల స్కాలర్ అందిస్తుంది. ఎనిమిదో తరగతి చదువుతున్న గబులంగి జోష్న, పి. జెస్సికా, చింతా వివేక్ నాగసాయి స్కాలర్‌కు ఎంపికయ్యారు. వారిని ఎంఈవో రాంబాబు, గణిత ఉపాధ్యాయులు తిరుపతిరావు, కృష్ణ పడాల్, ఇతర ఉపాధ్యాయులు చందు, శ్రీనివాసరావు, రాజశేఖర్, లావణ్య తదితరులు అభినందించారు. తమ పాఠశాల నుంచి ముగ్గురు స్కాలర్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఎంఈవో తెలిపారు.

రాయితీపై విత్తనాలు, పరికరాల పంపిణీ



లోతుగెడ్డలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

చింతపల్లి: మండలంలో గిరిజన రైతాంగానికి వ్యవసాయాధారిత విత్తనాలు, పరికరాలను 90 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం లోతుగెడ్డ గ్రామ సచివాలయంలో లోతుగెడ్డ, కుడుముసారి, తమ్మెంగుల, బలపం పంచాయతీలు ప్రజాప్రతినిధులతో 'ధరి ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్' పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా సమగ్ర, సుస్థిర వ్యవసాయ అభివృద్ధి కోసం పంచాయతీ ప్రతినిధులు సహకరించాలన్నారు. పీవీటీజీ రైతులకు 90 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలు, విత్తనాలు, సూక్ష్మ పోషక ఎరువులు, సోలార్ పంపుసెట్లు, బిందు సేద్య పరికరాలను రాయితీపై అందిస్తున్నామన్నారు. వ్యవసాయ ఆధారిత కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచుల సునీల్, లక్ష్మయ్య, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కొయ్యూరు మండల కమిటీ నియామకం

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కొయ్యూరు మండల కమిటీ నియామకమైంది. పార్టీ ఉపాధ్యక్షులుగా నరసి కృష్ణా, నాతురు సోమన్నదొర, ప్రధాన కార్యదర్శులుగా పల్లి చిన్నబ్బాయి, రీమల గంగాధర్, పెట్ల గాంధి, గోర గంగరాజు, కార్యదర్శులుగా కూడా రాజబాబు, వారా నూకరాజు, కిముడు సత్యనారాయణ, రీమల శ్రీనివాస్, పొట్టిక శ్రీను, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పొట్టిక శ్రీనివాస్, దుంపా రాజబాబు, కూడా రాజబాబు, కూడా అప్పలనాయుడు, ఎలూరి రామరాజు, దూరి గంగరాజు, దుచ్చేరి వెంకటేశ్వర్లు, సెగ్గె నూకరాజు, సర్ల గంగా పవన్, అప్పిలి పల్లారావు, దేశగిరి బాలకృష్ణ, కూడా చిన్నయ్య, గాడి అచ్చిరాజు, పొడుగు మోహన్‌రావు, కంకిపాటి శివకుమార్, తుబే వికాస్, శెట్టి అబ్బాయిదొర, పల్లల గణపతిరెడ్డి, మసిలియ బుద్దు, కాకరి స్వామినాయుడు, వాసా కృష్ణ, సుర్ల గణపతి, పాంగి కన్నయ్య, రవడం శేఖర్, గజ్జిదర అప్పన్న, దాసరి వెంకటరమణ, బచ్చల లక్ష్మణరావు, బంటు నాగేశ్వరరావు, కల వనంబాబు, కోనెపు కన్నబాబు, బుర్కు కుశరాజు, పాడి లక్ష్మణరావు, మాదెల కృష్ణమోహన్ నియమితులయ్యారు.

ఏజెన్సీలో అక్రమ కట్టడాలు తొలగించాల్సిందే

రంపచోడవరం: డివిజన్‌లో 1/70 చట్టానికి విరుద్ధంగా ఉన్న అన్ని అక్రమ కట్టడాలను కూల్చివేయాల్సిందేనని ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు మోడిద నూకరాజు, ఉపాధ్యక్షురాలు బోరగా ఎర్రమ్మ, కార్యదర్శి చోటి ప్రదీప్‌కుమార్‌దొర శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ఏరియా పరిరక్షణకు అక్రమ నిర్మాణాల కూల్చివేత ఎంతో ప్రయోజనకరమన్నారు. అధికారులు ఆదివాసీ అభివృద్ధికి పరిరక్షణకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. వారికి రాజకీయ సహకారం కరువైందని వాపోయారు. చట్టాల అమలులో రాజకీయ అడ్డంకులు సృష్టించవచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు.